క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే



మానవపాడు: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పీఎంఏవై ఆవాస్ ప్లస్ సర్వేను శనివారం ఎంపీడీఓ రాఘవ పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల సర్వే వారంలో పూర్తి చేయాలని కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి శివశంకర్, సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



అలంపూర్: కర్నూలులోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే విజయుడు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు.మానవపాడు మ ం డలం పోతులపాడుకు చెందిన ఈరమ్మకు రూ.15 వేలు, జల్లాపురానికి చెందిన శిరీషకు రూ.6 వేలు చెక్కు మంజూరైనట్లు పేర్కొన్నారు.

నదీ జలాలతో ప్రత్యేక పూజలు



అయిజ: తుంగభద్ర నదీ జలాలతో మండలంలోని వేణిసోంపురంలో శనివారం వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలతో తుంగభద్ర నదికి చేరుకొని గంగ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వరకు నదీ జలాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. స్వామి వారికి బిందెసేవ, పంచామృత అభిషేకం, రుద్రాభిషేకం, కళశాభిషేకం చేశారు.

దివ్యాంగుల పింఛన్లను రూ.6 వేలకు పెంచాలి



మానవపాడు: దివ్యాంగుల చేయూత పింఛన్లను రూ.6 వేలకు పెంచాలని శనివారం ఎమ్మార్పీస్ మస్తాన్ మాదిగ, దివ్యాంగుల పోరాట సమితి ఆధ్వర్యంలో మండలంలోని పల్లెపాడు పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వితంతు, చేనేత, గీతా, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలకు ఫించన్ రూ.2 వేల నుంచి రూ. 4వేల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గొల్ల కాంతన్న, తెలుగు కన్నయ్య, బోయ రామాంజనేయులు, ఆంజనేయులు, చంద్రన్న, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భాగవత సప్తాహం

ఇటిక్యాల: మండల పరిధిలోని నక్కలపల్లిలో ఆలయ కమిటీ విశ్వహిందూ పరిషత్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఏడు రోజులుగా నిర్వహించిన భాగవత సప్తాహ కార్యక్రమం శనివారం ముగిసింది. ప్రతి మనిషికి ఆనందం ముఖ్యమని లౌకికానందం తాత్కాలికం మాత్రమేనని నిజమైన ఆనందం భాగవత ప్రవచనం ఆలకించడం ద్వారానే అనుభవమవుతుందని సూక్తులు వినిపించారు. ఆటపాటలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు.

విద్యార్థులకు పలకలు, బాక్సుల పంపిణీ



గట్టు: గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ముచ్చోనిపల్లె ప్రాథమిక పాఠశాలలో శనివారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం చిన్నారులకు పలకలు, కంపాక్స్ బాక్స్‌లు అందజేశారు. చాగదోన ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలసి మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహులు, జీహెచ్ఎం రామ్మూర్తి, పీఎస్ హెచ్ఎం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు

నిఘా నేత్రం.. నిర్వహణ లోపం

- గ్రామాల్లో సీసీ కెమెరాల నిర్వహణ అస్తవ్యస్తం
- రూ.లక్షలు ఖర్చు పెట్టినా నిరుపయోగం



మైలగడ్డ ప్రధాన కూడలిలో పని చేయని సీసీ కెమెరా

కేటీదొడ్డి: మండలంలోని ఆయా గ్రామాల్లో చోరీల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణపై నిర్లక్ష్యం వహించడంతో అవి మూలకు పడ్డాయి. దీంతో గ్రామాల్లో చోరీలు జరిగినప్పుడు వాటిని ఛేదించడం పోలీసులకు సవాలుగా మారింది. రూ.లక్షల వెచ్చించి గ్రామీణ ప్రాంతాల్లో పాటు మండల కేంద్రాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు విరాళాల సహకారంతో సీసీ కెమెరాలను బిగించినప్పటికీ వాటి నిర్వహణ లేక మరుగునపడ్డాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

దాతల సాయంతో..

మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని మైలగడ్డ, కొండాపురం, నందిన్నె, కేటీదొడ్డి, ఇర్కిచేడు, కుచినెర్ల తదితర గ్రామాల్లో దాతల సహకారంతో ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.30 వేల వరకు విలువ చేసే 24 సీసీ కెమెరాలను రూ.7.20 లక్షలు వ్యయంతో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కెమెరాల నిర్వహణ లేక పోవడంతో అవి కాస్తా మూలనపడి వృథాగా ఉన్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి

దాతల సాయంతో ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు నిర్వహణ బాధ్యత ఎవరు తీసుకోవాలనే ప్రశ్న ప్రతి గ్రామంలో తలెత్తింది. ఇటీవల మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో షాపులు, ఇళ్లల్లో వరుస చోరీ ఘటనలు చోటు చేసుకున్నాయి.

మైలగడ్డ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కిరాణషాపులో చోరీకి పాల్పడ్డారు. కుచినెర్లలో ఓ మహిళ మెడలో బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన ఘటనలు చోటు చేసుకున్నాయి. వీటిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు కూడా నమోదయ్యాయి. సీసీ కెమెరాలు పని చేస్తేనే చోరీలను అడ్డుకునే వీలు ఉంటుందని పోలీసులు కూడా పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు చొరవ చూపి గ్రామాల్లో సీసీ కెమెరాలను వాడుకలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కొండాపురం స్టేజీలో పని చేయని సీసీ కెమెరా

మరమ్మతు చేపట్టాలి



మండల కేంద్రంలో చాలా రోజులుగా సీసీ కెమెరాలు పని చేయడం లేదు. ఇటీవల కిరాణ షాపులో చోరీ జరిగింది. మండల కేంద్రానికి నిత్యం వందలాది మంది వస్తూ వెళ్తుంటారు. ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి కెమెరాలకు మరమ్మతు చేపట్టాలి.

– శివ, ఆన్‌లైన్ సెంటర్ యాజమాని

వినియోగంలోకి తీసుకోస్తాం

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో కొన్ని పని చేయడం లేదు. కెమెరాలకు త్వరలో మర్మమ్మతు చేపట్టి వినియోగంలోకి తీసుకోస్తాం. అంతే కాకుండా మరికొన్ని ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తాం.

– శ్రీనివాసులు, ఎస్‌ఐ

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలా క్షేత్రం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. అర్చకులు మధుసూదనాచారి, రవిచారి స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదే విధంగా సద్దలోనిపల్లి కృష్ణస్వామి, అమరవాయి వీరభద్రస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు అరవిందరావు, బాబురావు, చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ జడ్జి పూజలు

ఆదిశిలా క్షేత్రంలో కర్నూలు జిల్లా రిటైర్డ్ జడ్జి శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.



మొమెంటో అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

ఆలయ నిర్వాహకులు, అర్చకులు వారికి సాదర స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. నిర్వాహకులు అరవిందరావు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి మొమెంటో అందజేశారు.

అవార్డు గ్రహీతల అభినందన సభ

గద్వాల: అఖిల భారత యాదవ మహాసభ జోగుళాంబ గద్వాల జిల్లా సౌజన్యంతో యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఉత్తమ అవార్డు అందుకున్న ఉపాధ్యాయులకు అభినందన సభ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. జిల్లా సభ అధ్యక్షుడు బండల వెంకటరాములు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాస్కర్‌యాదవ్, వెంకటేష్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులు పెంచాలి

గద్వాల: ఉపాధ్యాయులు కొరత లేకుండా జిల్లాలో ఉపాధ్యాయుల పోస్టుల సంఖ్య పెంచాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో డీఎస్సీ అభ్యర్థులతో కలిసి కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఉపాధ్యాయులు కొరత ఉన్న పాఠశాలలను గుర్తించి వెంటనే టీచర్లను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మహేష్, శ్రీను, రమేష్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువుపై దృష్టి సారించాలి



ధరూరు ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి



నందిన్నె పాఠశాలలో ఉపాధ్యాయులుకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

ధరూరు/గట్టు/మల్దకల్/కేటీదొడ్డి: తమ పిల్లల చదువులపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా దృష్టి సారించాలని ఎంఈఓ రవీంద్రబాబు, జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం ధరూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మండల పరిధిలోని రేవులపల్లి ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువుకు సంబంధించిన పురోగతిని తల్లిదండ్రులకు తెలియజేశారు. దసరా సెలవులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు సహకరిస్తే మెరుగైన ఫలితాలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

✤ తల్లిదండ్రుల చేతుల్లోనే పిల్లల భవిష్యత్ ఉంటుందని ఎంపీడీఓ చెన్నయ్య అన్నారు. గట్టు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో యాన మాట్లాడారు. విద్యార్థులను పొలం పనులకు ఉపయోగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎం నల్లారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

✤ పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్, జీహెచ్ఎం నరేష్ సూచించారు. మల్దకల్, అమరవాయి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

✤ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ అన్నారు. కేటీదొడ్డి మండలం నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని సూచించారు. అనంతరం మాతాపిత వందన కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు పాదాభివందనాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాస శివరాత్రి పూజలు



రాజోళి: మాస శివరాత్రిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని నందిబండ శివాలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి బిందె సేవ నిర్వహించి శివాష్టోత్తరం, పంచాక్షరీ మంత్రాలతో క్రతువులు జరిపించారు.

పథకాల పేరిట కాలయాపన



ఎర్రవల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరిట కాలయాపన చేస్తుందని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చక మోసం చేస్తుందని మండిపడ్డారు. ఇప్పుడు మైనార్టీ వర్గాల ప్రజలను లక్ష్యంగా చేసుకొని కొత్త పథకాలకు శ్రీకారం చుట్టి వారిని సైతం మోసం చేయాలని చూస్తుందన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మణికుమార్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ కార్మికుల జీతాలు పెంచాలి

అయిజ: ప్రభుత్వం కేజీబీవీ కార్మికుల జీతాలు పెంచాలని, పనిభారం తగ్గించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హరీష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీలో సెప్టెంబర్ 22న నిర్వహించనున్న చలో హైదరబాద్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ప్రభుత్వం కేజీబీవీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు గీత, రాధ, పద్మ, చంద్రకళ, భాగ్యమ్మ, సరోజమ్మ, పద్మమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న హరీశ్

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మండలంలోని క్యాతూర్ గ్రామంలో మొక్కజొన్న, పత్తి పంటలను వ్యవసాయ అధికారి నాగార్జునరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిలో ఎర్రగుమ్మడి తెగులు ఉన్నందున సస్యరక్షణ చేపట్టాలన్నారు. సల్ఫేట్ 13–0–45 కేజీ, మెగ్నీషియాన్ని పిచికారీ చేయాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

అమరచింత: పరిసరాలు పరిశుభ్రంగా ఆరోగ్యకరంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. స్వచ్ఛ తాహీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 8వ వార్డులో పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను తొలగించి, మురుగుకాల్వల వెంట బ్లీచింగ్ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ యూసుఫ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు



మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వైద్యులు హేమమానస, హేమలత ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య కేంద్ర పరిధిలోని 256 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు నీరజ్, శాంతి, కిరణ్, క్రాంతి, ప్రదీప్, శ్రావణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

అలంపూర్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీసీఐటీయూ జిల్లా కార్యదర్శి నరసింహ, అంగన్‌వాడీ టీచర్స్ అండర్ హెల్పర్స్ యూనియర్ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ డిమాండ్ చేశారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా మూడవ మహసభలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 2లక్షలు ఇవ్వాలన్నారు. ప్రీ ప్రైమరీ స్కూల్స్, పీఎంశ్రీ విద్యను అంగనవాడీల్లో కొనసాగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీలపై పని భారం పెరుగుతుందన్నారు. ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయాల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. మెనూ చార్జీలు, ఇంటి అద్దె చెల్లించాలని, డబుల్ సిలిండర్, వంట పాత్రలు అందజేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా సలోమి, కార్యదర్శిగా ఏమేలమ్మ, కోశాధికారిగా శాంతమ్మ, ఉపాధ్యక్షులుగా అనసూయ, ఈశ్వరి, కమిటీ సభ్యులుగా ఆదిలక్ష్మి, జ్యోతిలక్ష్మి, సుమిత్ర, చిట్టెమ్మను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించాలి



గెలుపొందిన విద్యార్థులతో బీజేపీ నాయకులు

గద్వాలటౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను ప్రోత్సహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేపీ నాయకులు విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి విద్యార్థి దశ చాలా కీలకమైందన్నారు. విద్యార్థులలో పోటీతత్వాన్ని పెంచడానికి టాలెంటు టెస్టులు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జహురుద్దీన్, బీజేపీ నాయకులు రవికుమార్, పద్మజ, నర్సింహశెట్టి, రమాదేవి, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు తప్పనిసరి



పాతపాలెం శివారులో పంటల వివరాలు సర్వే చేస్తున్న అధికారులు

కేటీదొడ్డి: ప్రతి రైతు తమ పంటల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులతో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని పాతపాలెంలో పంటల నమోదు ప్రక్రియను ఏఓ తనిఖీ చేశారు. సర్వే ఆధారంగా పంటలకు అవసరమయ్యే ఎరువులు సమకూర్చడంతో పాటు పంట కొనుగోళ్ల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ లావణ్య, రైతులు పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడులు



నానో ఎరువులపై అవగాహన కల్పిస్తున్న హరిప్రియ

ధరూరు: నానోయూరియాతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ అగ్రానమిస్ట్ హరిప్రియ, మార్కెటింగ్ అధికారి రవికుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో రైతులకు నానో డీఏపీ, నానో యూరియాపై బుర్రకథ, పాటల రూపంలో కళాకారులు అవగాహన కల్పించారు. లీటర్ నానోయూరియా స్ప్రేను ఎకరా పంటకు వినియోగించవచ్చన్నారు. ఒక ట్యాంకుకు 50 ఎంఎల్ వాడుకోవాలన్నారు. నానో డీఏపీను ఎకరాకు లీటరు చొప్పన 10 రోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు వాడడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చనని సూచించారు. రైతులు సేంద్రీయ ఎరువుల వాడి సేంద్రీయ కర్బనాన్ని పెంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబురాలు



గట్టు ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శనివారం వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు శనివారం ముందస్తుగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు వివిధ రకాల పూలత బతకమ్మను అందంగా సిద్ధం చేశారు. బతకమ్మలను శిరస్సుపై ధరించి ఊరేగింపు నిర్వహించారు. పాఠశాలలకు దసరా సెలవులు ఉండటంతో ముందస్తుగా వేడుకలు చేశారు. మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకచోట చేరి బతుకమ్మ ఆడారు. బొడ్డెమ్మలు వేస్తూ ఆనందంగా గడిపారు. చదువుతో పాటుగా తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు పండుగల గొప్పతనాన్ని తప్పనిసరిగా తెలుసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేశారు.



నందిన్నె పాఠశాలలో..



వావిలాలలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు



మానవపాడులో..



ఉండవెల్లి పాఠశాలలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఎర్రవల్లిలో రంగురంగుల బతుకమ్మలతో చిన్నారులు